సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 14 । అక్టోబర్ । 2023



అమృత్ భారత్‌కు చీపురుపల్లి రైల్వేస్టేషన్ ఎంపిక - 10లో

'అమృత్ భారత్'కు చీపురుపల్లి రైల్వేస్టేషన్ ఎంపికైంది. అభివృద్ధికి ఆస్కారం కలిగింది.



బంగారుతల్లికి ఘనంగా సన్మానం

రెతు కుటుంబానికి చెందిన ఆడబిడ్డ రెడ్డి మౌనిక ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. - 10లో



నేడు విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ

విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలను పెద్ద ఎత్తున పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 10లో

న్యూస్‌రీల్

దసరా ఉత్సవాలకు ఆహ్వానం



దసరా ఉత్సవాలకు కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వీరఘట్టం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాలకొండ శ్రీ కోటదుర్గమ్మతల్లి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. వీరఘట్టంలో జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్‌ను ఆలయ ప్రధాన అర్చకులు, దేవదాయశాఖ అధికారి కలిసి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

దసరాకు ప్రత్యేక బస్సు సర్వీసులు

- జిల్లా ప్రజారవాణా శాఖాధికారి టీవీఎస్ సుధాకర్



డీపీటీఓ టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: దసరా పండగ సందర్భంగా జిల్లా నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు జిల్లా ప్రజారవాణాశాఖాధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. స్థానిక డీపీటీఓ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోల నుంచి ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు అదనపు బస్సు సర్వీసులను నడుపుతామని చెప్పారు. 20, 21 తేదీల్లో హైదరాబాద్ నుంచి పార్వతీపురం పట్టణానికి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బస్సులన్నీ సాధారణ చార్జీలతోనే నడుపుతామని స్పష్టంచేశారు. ప్రయాణికులంతా ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికులకు న్యాయం చేయండి

- జీగిరాం జ్యూట్‌ఫ్యాక్టరీ యాజమాన్యానికి డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచన



జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీ యాజమాన్యప్రతినిధితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: జీగిరాం జ్యూట్‌ఫ్యాక్టరీ కార్మికుల బకాయిల చెల్లింపుతో పాటు ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలని యాజమాన్య ప్రతినిధి సప్తగిరికి డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచించారు. విశాఖపట్నంలో డిప్యూటీ సీఎంను శుక్రవారం సప్తగిరి కలిశారు. ఇప్పటివరకు చాలామంది కార్మికుల బకాయిలు చెల్లించామని, మిగిలినవారికి కొద్దిరోజుల్లో చెల్లిస్తామని తెలిపారు. కార్మికులు సమష్టిగా జ్యూట్ మిల్ నడుపుతామంటే మాకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. మిల్లును నడిపించేందుకు కొత్త యాజమాన్యాన్ని చూస్తున్నామంటూ కొన్ని శక్తులు కార్మికులను పక్కదారి పట్టిస్తున్నాయని, అందుకే కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాజన్నదొర సూచనల మేరకు త్వరలోనే జ్యూట్‌మిల్లు తెరిపించడంతో పాటు, కార్మికులకు బకాయిలు చెల్లిస్తామని చెప్పారు. రాజన్నదొరను కలిసినవారిలో మున్సిపల్ అర్బన్ బ్యాంకు చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు ఉన్నారు.

అడ్డాపుశిలలోనే కలెక్టరేట్

- కలెక్టర్ నిశాంత్ కుమార్



అడ్డాపుశిలలో స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం టౌన్: అడ్డాపుశిలలో కొత్త సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన 59.80 ఎకరాలను కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన కన్సల్టెంట్ గ్రూప్ ఆకార్ ప్రతినిధి అషీద్‌కు స్థలాన్ని చూపించారు. స్థలం నిర్మాణానికి అనుకూలంగా ఉందని అషీద్ తెలిపారు. పరిపాలనకు సరిపోయేలా, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించాలని కన్సల్టెంట్‌కు కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ నిర్మాణంపై తప్పుడు సమాచారాన్ని అందించిన ఆర్అండ్‌బీ ఈఈ జేమ్స్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈ ఎస్.వేణుగోపాల్, ఉపకార్యనిర్వహణ ఇంజినీర్ ఎ.అప్పాజీ, టిడ్కో ఇంజినీర్లు, తహసీల్దార్ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొండంత అండ

- ప్రతి ఇంటికీ గిరిజన పంట
- తక్కువ ధరలకే గిరిజన ఉత్పత్తులు
- జీసీసీ ఆధ్వర్యంలో ఆయుష్షును పెంచే ఆరోగ్యకర ఉత్పత్తుల విక్రయం
- వీడీవీకే, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ప్రాసెసింగ్
- ట్రైఫెడ్ సహకారంతో మార్కెటింగ్‌కు ప్రణాళికలు
- తొలుతగా సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పరిధిలో స్టాల్స్ ఏర్పాటు
- జీసీసీకి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం
- రూ.కోట్లలో టర్నోవర్ చేయడమే లక్ష్యం

కొండకోనల్లో సేంద్రియ పద్ధతుల్లో గిరిజనులు పండించే ఆరోగ్యకర పంటలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయి. ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచుతున్నాయి. ప్రభుత్వ తోడ్పాటుతో నాణ్యమైన గిరిజన ఉత్పత్తులను వినియోగదారులకు సరసమైన ధరకే అందించే బృహత్తర క్రతువును జీసీసీ భుజానకెత్తుకుంది. ట్రైఫెడ్ సహకారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఓ వైపు గిరిజన రైతులకు, మరోవైపు వినియోగదారులకు లబ్ధిచేకూర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. గిరిజన ఉత్పత్తుల ప్రాసెసింగ్, విక్రయాలు, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలకు 'సాక్షి' అక్షరరూపం.





విజయనగరం డెస్క్:

గిరిజన రైతులు సేంద్రియ, ప్రకృతి సాగు పద్ధతుల్లోనే పంటలు పండిస్తారు. చిరుధాన్యాల నుంచి ఉద్యానవనాల వరకు రసాయనిక ఎరువులకు దూరంగా 'సాగు'తున్న రైతులకు జీసీసీ వెన్నుదన్నుగా నిలుస్తోంది. గిరిజనుల నుంచి సేకరించిన నాణ్యమైన, ఆరోగ్యకర ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తోంది. గిరిజన ప్రాంతాల్లోనే కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్రప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుండడంతో ట్రైఫెడ్ సహకారంతో మార్కెటింగ్ ప్రణాళికలను రచిస్తోంది. ఇందులో భాగంగా దేశంలోనే తొలుతగా సీతంపేటలో ఇటీవల గిరిజన ఉత్పత్తుల మేళాను నిర్వహించింది. సీజనల్‌గా లభించే పంటలను పొదుపుసంఘాల మహిళల సహకారంతో ప్రతి ఇంటికీ తక్కువ ధరకే చేర్చుతోంది. పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుండడంతో ఇటు గిరిజన రైతులకు దళారుల బెడదలేకుండా అధిక ఆదాయం సమకూరుతుండగా, అటు వినియోగదారులకు తక్కువ ధరకే ఆరోగ్యకర ఉత్పత్తులు లభిస్తున్నాయి.

ఏజెన్సీలో లభించే గిరిజన ఉత్పత్తులు ఇలా..

చింతపండు, పసుపు, కుంకుడుకాయలు, నల్లజీడి పిక్కలు, నరమామిడిచెక్క సీతాఫలాలు, కొండచీపుళ్లు, జీడిపిక్కలు, ఎండు ఉసిరిపప్పు, ముషిడిక పిక్కలు, తానికాయలు, తేనె, రాగులు, కొర్రలు, జొన్నలు, వరి, సీతాఫలాలు, పైనాపిల్, నిమ్మ, రామబలం, దబ్బ పండ్లు. కాఫీఆకు తదితరవి.

ప్రాసెసింగ్ ఇలా..

గిరిజన రైతులు ఉత్పత్తిచేసే పంటలకు తొలుత జీసీసీ మద్దతు ధర ప్రకటిస్తుంది. ఆ మేరకు కొనుగోలుచేసి వీడీవీకే (వన్‌ధన్ వికాస్ కేంద్రాలు), గిరిజన ఉత్పత్తి సహకార సంఘాలకు సరఫరా చేస్తుంది. అక్కడ సహజ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయిస్తుంది. ఆకర్షించే ప్యాకింగ్ చేయించి మార్కెటింగ్ చేస్తుంది. దీనివల్ల పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని వందలాదిమంది గిరిజనులకు ఉపాధి కలుగుతోంది.

విరివిగా స్టాల్స్...

గిరిజన ఉత్పత్తులు నాణ్యమైనవి కావడం, అమ్మకాలకు ప్రభుత్వం సహకరించడంతో జీసీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యకూడళ్లలో గిరిజన మహిళలు, పొదుపుసంఘాల సభ్యులతో స్టాల్స్ ఏర్పాటుచేయిస్తోంది. ప్రజలకు ఆరోగ్యకర ఉత్పత్తులను చేరవ చేస్తోంది. శ్రీవారి సేవకు జీసీసీ నుంచి తేనె పెద్ద ఎత్తున సరఫరా అవుతోంది. ఆయుర్వేద మందులను సైతం మార్కెటింగ్ చేస్తోంది. ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది.

మార్కెటింగ్ చేసే ఉత్పత్తులు

పసుపుపొడి, కారంపొడి, రాగులు, కొర్రలు పిండి, దంపుడు బియ్యం, శీకాకాయ పొడి, కుంకుడు కాయలు, కుంకుడుకాయ షాంపూ, నన్నారి షరాబత్, సబ్బులు, తెనె, త్రిఫల డ్రింక్స్, జాస్మిన్‌లోషన్, కుంకుమ పొడర్, అరకు కాఫీపొడి, రాజ్‌మారెడ్‌స్మాల్, హెర్బల్‌పెయిన్ రిలీఫ్ ఆయిల్, గిరిగోల్డ్‌బ్లాక్ పెప్పెర్, మారేడు బామ్, వివిధ రకాల హస్తకళావస్తువులు, తదితరవి.





ఆరోగ్యానికి మేలు



జీసీసీ విక్రయించే వివిధ రకాల వస్తువులను గత నాలుగేళ్లుగా వినియోగిస్తున్నాను. అలోవేరా సబ్బులు, కుంకుడుకాయ, శీకాయ షాంపూలు కుటుంబమంతా వినియోగిస్తున్నాం. తేనె వాడుతున్నాను. త్రిఫల డ్రింక్ కూడా ఆరోగ్యానికి ఉపయోగపడుతోంది. గిరిజన ఉత్పత్తులు నాణ్యమైనవి.

– ఎస్.రవికుమార్, కడగండివలస, సీతంపేట

గిరిజనులకు అన్ని విధాలా సహకారం



గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నాం. కొన్ని రకాల ఉత్పత్తులపై గతంలో కంటే రెండింతలు మద్దతుధరలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుంది. గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన ఉత్పత్తులను, ఉప ఉత్పత్తులుగా తయారు చేసి జీసీసీ విక్రయిస్తోంది.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

ఆర్థిక ఊతం



స్వచ్ఛమైన ముడిసరుకులతో ప్రజారోగ్యానికి ఎటువంటి హాని కలిగించని ఉత్పత్తులను జీసీఎంఎస్ ఆధ్వర్యంలో విక్రయిస్తున్నాం. ఆరోగ్యానికి మేలు చేసే ఆయుర్వేద ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్నాం. ప్రకృతి సిద్ధమైన గిరిజన ఉత్పత్తులు దళారుల పాలవకుండా మైదాన ప్రాంతాల ప్రజలకు చేరువచేసే చర్యలను జీసీఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టాం. రానున్న రోజుల్లో గిరిజన ఉత్పత్తులను ప్రజలందరికీ చేరువచేసే ప్రణాళిక సిద్ధం చేశాం. గిరిజనులకు ఆర్థిక ఊతం కల్పిస్తాం. ముడిసరుకులకు మద్దతు ధర కల్పిస్తాం.

– జి.సురేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, జీసీసీ

ప్రతి గ్రామానికి చేరువ చేస్తున్నాం



జీసీఎంఎస్‌కు మరింత ఆదాయం చేకూరేలా ఉత్పత్తులను గ్రామ స్థాయి ప్రజలకు అందించేందుకు మొబైల్ సేవలను ప్రారంభించాం. ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులతో మాట్లాడి స్టాల్స్ ఏర్పాటు చేశాం. దీనివల్ల గిరిజనులు లబ్ధి పొందడమే కాకుండా ప్రభుత్వానికి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రతి గ్రామానికి జీసీఎంఎస్ ఉత్పత్తులు సరఫరా అయ్యేలా మొబైల్ సేవలను విస్తృతం చేస్తాం. దళారుల చేతిలో గిరిజనులు మోసపోకుండా డిపోల ద్వారా ఉత్పత్తులను స్థానికంగా కొనుగోలు చేసి ఆర్థికంగా అండగా నిలుస్తున్నాం.

– మహేంద్ర కుమార్, జీసీసీ డివిజనల్ మేనేజర్, పార్వతీపురం మన్యం

పార్వతీపురం మన్యం జిల్లాలో జీసీసీ పరిధిలో గిరిజన ఉత్పత్తుల అమ్మకం ఇలా..	
2020–21	రూ.74లక్షలు
2021–22	రూ.28 లక్షలు
2022–23	రూ.1.49కోట్లు
2023–24	రూ.15లక్షలు (నేటివరకు)

జీసీసీ ఉత్పత్తులకోసం సంప్రదించాల్సిన డివిజనల్ మేనేజర్ ఫోన్ నంబర్:
83339 10193
ఆన్‌లైన్ వెబ్‌సైట్:
దబ్ల్యూదబ్ల్యూదబ్ల్యూ.ఏపీగిరిజన.కామ్

గిరిజన రైతులకు జీసీసీ చెల్లిస్తున్న మద్దతు ధర (కిలో/లీటర్‌కు) ఇలా..

రకం	ధర (రూపాయల్లో)
తేనెమైనము	160
తేనెరాక్‌బీ	200
ఎపేరి తెనె	150
పిక్కతో చింతపండు	32.40
పిక్కతీసిన పండు	63
చింత పిక్కలు	10
ఇండుగ పిక్కలు	50
ముషిడిక పిక్కలు	60
మారేడు గడ్డలు	500
విప్పపప్పు	29
కాగుపప్పు	22
కరక్కాయలు	18
గచ్చకాయలు	45
నరమామిడి చెక్క	18
కొండచీపురు	45
శీకాయ	50
కుంకుడుకాయలు	60
ఎండు ఉసిరిపప్పు	90
తానికాయలు	15
నల్లజీడిపిక్కలు	18

'జగనన్నకు చెబుదాం'కు 132 వినతులు

- కలెక్టర్‌కు వినతులు అందజేసిన అర్జీదారులు
- దీర్ఘకాలిక సమస్యలను వివరించిన ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనూహ్యస్పందన లభించింది. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు 132 అర్జీలు వచ్చాయి. కొందరు తమ వ్యక్తి గత సమస్యల పరిష్కారం కోసం వినతులు అందజేయగా, మరికొందరు తమ వీధిలో, గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు. వీటన్నింటినీ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రజల తరపున పలు అర్జీలను అందజేశారు. వీరఘట్టం మండలంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్జీల్లో కొన్ని...

- వీరఘట్టం మందిరం వీధికి చెందిన జి.రవికుమార్ అనే ఆర్టీసీ డ్రైవర్ 2015లో ప్రమాదానికి గురై కంటిచూపు కోల్పోయాడు. ఉద్యోగాన్ని భార్య స్వప్నకు ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు.
- వీరఘట్టం కళింగ వైశ్య సంఘానికి సామాజిక భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘ సభ్యులు కలెక్టర్‌ను కోరారు.
- వీరఘట్టం ఒట్టిగెడ్డ సమీపంలోని శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని గ్రామస్తులు విన్నవించారు.
- ముచ్చర్లవీధిలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలని వీధివాసులు కోరారు.
- రూ.5.50 కోట్ల వ్యయంతో చేపడుతున్న వీరఘట్టం ప్రధాన రహదారి పనులను సత్వరమే పూర్తిచేయాలని స్థానికులు విజ్ఞప్తిచేశారు.
- వీరఘట్టం కస్పావీధి శివారులోని వట్టిగెడ్డ పరివాహక ప్రాంతంలో రక్షణగోడ నిర్మించాలని వినతి పత్రం అందజేశారు.
- వీరఘట్టం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కళావతి కోరారు.
- తోటపల్లి ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తిచేయాలని రైతులు కోరారు.



కలెక్టర్‌కు పలు సమస్యలను వివరిస్తున్న పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



అర్జీదారుల సమస్యను శ్రద్ధగా వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

- వీరఘట్టం మేజరుపంచాయతీ ప్రజలకు అచ్చెపువలస వద్ద ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు కట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, ఆ స్థలంలో ఇటీవల వీరఘట్టంకు మంజూరైన ఐటీఐ కాలేజీ నిర్మించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జె.అమర్‌నాథ్ కోరారు.
- దశుమంతపురంలో రోడ్డు అభివృద్ధి చేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి కోరారు.
- వీరఘట్టం మండల పరిషత్ కార్యాలయాన్ని అభివృద్ధి చేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు కోరారు.
- వీరఘట్టం వ్యవసాయ సహకార పరపతి సంఘానికి శాశ్వత భవన నిర్మాణానికి స్థలం సమకూర్చాలని పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు కలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు.
- వీరఘట్టం నుంచి విశాఖపట్నంకు నేరుగా బస్సు సదుపాయం కల్పించాలని పట్టణ ప్రజలు కోరారు.
- వీరఘట్టం ప్రభుత్వాస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ గోవిందరావు, పార్వతీపురం ఆర్డీఓ హేమలత, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పసరమందులతో ప్రమాదం



పాలంగూడ గ్రామంలో చిన్నారులకు వైద్యపరీక్షలు చేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

కురుపాం: పాలంగూడ గిరిజన గ్రామంలో రెండు వారాల కిందట పచ్చకామెర్లతో మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శుక్రవారం పరామర్శించారు. చిన్నారుల మృతిపై ఆరా తీశారు. పలువురు చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి వెళ్లి వైద్యులకు చూపించాలన్నారు. పసరమందు వినియోగం ప్రమాదకరమన్నారు. ఆయన వెంట సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు, ట్రైబల్‌రైట్ ఫోరం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రామకృష్ణ, దీనమయ్య ఉన్నారు.

ప్రజలందరికీ ఉచిత వైద్యం : డీఎంహెచ్‌ఓ

పార్వతీపురం టౌన్: ప్రజలందరికీ ఉచిత వైద్యసేవలు అందించి ఆరోగ్య భరోసా కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరాలను జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజారోగ్యానికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని గ్రామస్థాయిలో అందిస్తున్నట్టు తెలిపారు.



వెంకంపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

జిల్లాలో శుక్రవారం జేఏఎస్‌లో అందిన వైద్యసేవలు ఇలా..	
మండలాలు	15
వైద్యశిబిరాలు	12
మొత్తం ఓపీలు	5,939
స్పెషలిస్టుల ఓపీలు	2,453
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	3,038
డీఎం	528
హెచ్‌టీఎన్	687
ఏఎన్‌సీ	133
పీఎన్‌సీ	81
అనీమియా	85
ల్యాబ్‌టెస్టులు	3,943
ఈసీజీ పరీక్షలు	148
రిఫరల్ కేసులు	98

26 నుంచి ఉత్తరాంధ్రలో సామాజిక బస్సు యాత్ర

- ప్రజలతో మమేకం కావడమే ప్రధాన ఉద్దేశం
- ఉత్తరాంధ్ర మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులతో వైవీ సుబ్బారెడ్డి, బొత్స సమీక్ష

సాక్షి, విశాఖపట్నం: రానున్న ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ వ్యూహరచన చేస్తోంది. దీనిలో భాగంగా బస్సు యాత్రకు ముహూర్తం ఖరారుచేసింది. సామాజిక బస్సు యాత్ర పేరిట రాష్ట్రమంతా పర్యటించాలని ప్రణాళిక రూపొందించింది. బస్సు యాత్రను ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులతో విశాఖపట్నంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ యాత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన విషయంతో పాటు.. జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. మహిళలకు, దళితులకు, వెనబడిన వర్గాల వారికి సీఎం వైఎస్ జగన్ చేసిన మేలు.. వెనుకబడిన వర్గాలకు ప్రధాన పదవులు కేటాయించిన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే భవిష్యత్తులో మరింత సువర్ణపాలన రానుందని ప్రజలకు వివరించాలన్నారు. ఈ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ నాయకత్వం ఎంత అవసరమో బస్సు యాత్ర ద్వారా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసు, పాలవలస విక్రాంత్, మజ్జి శ్రీనివాస్, కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి , వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ ముఖ్యులతో సమావేశమైన వై.వి.సుబ్బారెడ్డి.. చిత్రంలో డిప్యూటీ సీఎంలు బూడి, పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాద్‌రావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్

క్లుప్తంగా

తిప్పలవలస మత్స్యకారుడు అదృశ్యం


అదృశ్యమైన అచ్చోడు

పూసపాటిరేగ: బతుకు తెరువుకోసం కొంత కాలం క్రితం పొరుగు రాష్ట్రం గుజరాత్‌కు చేపల వేట నిమిత్తం వెళ్లిన పూసపాటిరేగ మండలంలోని తిప్పలవలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన రాయితి అచ్చోడు (35) గుజరాత్ రాష్ట్రానికి బతుకుతెరువు నిమిత్తం తండ్రి అప్పన్నతో కలిసి వెళ్లాడు. గుజరాత్‌లో పది రోజుల క్రితం వేట ముగించుకుని ఒడ్డుకు చేరిన అచ్చోడు తరువాత నుంచి కనిపించక పోవడంతో అక్కడి వారు తిప్పలవలసలో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ కుమారుడి ఆచూకీ తెలిసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

లింగనిర్ధారణ వెల్లడిస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించాల్సిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం 1994పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రోగ్రాం అధికారులు తమ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్‌లను విధిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ అచ్యుత కుమారి, డీఎల్ఓ డాక్టర్ సూర్యనారాయణ, ఘోషా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ శుభశ్రీ, డాక్టర్ సుజాత దేవి, జయలక్ష్మి, డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడి నియామకం


పిళ్లా నవీన్

విజయనగరం టౌన్: భారతీయ జనతాపార్టీ యువమోర్చా విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా పిళ్లా నవీన్‌కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం బాధ్యతలు అప్పగించారు. కొన్నేళ్లుగా పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తున్న తనను గుర్తించడం ఎంతో ఆనందంగా ఉందని నవీన్‌కుమార్ ఈ సందర్భంగా అన్నారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రజల పక్షాన నిలబడి పార్టీ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సెంచూరియన్‌లో టెలిమెడిసిన్ సేవలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో టెలిమెడిసిన్ సేవలు శుక్రవారం ప్రారంభమయ్యా యి. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల టెలిమెడిసిన్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెలిమెడిసిన్ సేవలతో పేదలకు పెద్ద ఎత్తున ఆరోగ్య పరీక్షలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. సమర్థవంతంగా కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్ ప్రొఫెసర్ ఆచార్యులు, సన్నీడియోల్, రమణారావు, డాక్టర్ చైతన్య, ప్రొఫెసర్ శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్‌కు చీపురుపల్లి రైల్వేస్టేషన్ ఎంపిక

- రూ.14 కోట్లతో ఆధునికీకరణ పనులు
- స్టేషన్‌కు రెండో వైపు ప్రవేశద్వారం
- డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్


అమృత్ భారత్ పథకంలో రూ.14 కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించిన ప్లాన్ పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకంలో చీపురుపల్లి రైల్వేస్టేషన్ ఎంపికైందని ఈ పథకం ద్వారా రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విశాఖపట్నం నుంచి ప్రత్యేక రైలులో చీపురుపల్లి వచ్చి రైల్వేస్టేషన్ పరిసరాలు, ఇక్కడున్న సౌకర్యాలు, ప్రస్తుతం ఉన్న సదుపాయాలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అమృత్ భారత్ పథకం ద్వారా రైల్వేస్టేషన్ అభివృద్ధికి సంబంధించి రైల్వే ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేసిన ప్లాన్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అమృత్ భారత్ పథకం ద్వారా రూ.14 కోట్లు నిధులు వెచ్చించి రైల్వేస్టేషన్ ఆధునికీకరించనున్నట్లు వెల్లడించారు. విజయదశమి, దీపావళి పండగల నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆ రెండు పండగలు పూర్తయ్యాక పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అమృత్‌భారత్ పథకంలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో వాహన పార్కింగ్ సదుపాయం, ముఖద్వారం ఆధునికీకరణ, ఇతర సదుపాయాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి రెండు వైపులా అనుసంధానం చేయనున్నామని తెలిపారు.

పెరగనున్న ప్లాట్‌ఫాంలు

అంతేకాకుండా విజయనగరం నుంచి భువనేశ్వర్ వరకు నాల్గవ లైన్ ఏర్పడడం ద్వారా ఇప్పుడున్న ప్లాట్‌ఫాంలు పెరగనున్నట్లు చెప్పారు. అలాగే ఇంతవరకు చీపురుపల్లి రైల్వేస్టేషన్‌కు ఒక వైపు మాత్రమే ప్రవేశ ద్వారం ఉందని తాజాగా జరగనున్న ఆధునికీకరణలో రెండో వైపు కూడా ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎంతోకాలంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ డిమాండ్ ప్రయాణికుల నుంచి ఉందన్న


రైల్వేస్టేషన్ పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విషయాన్ని స్థానిక విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ ప్రతిపాదన ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉన్నతాధికారులకు పంపించామని త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట అడిషనల్ డీఆర్‌ఎం ఏకే.గుప్త ఉన్నారు.

ఆలిండియా ఖోఖో పోటీలకు జిల్లా పీడీలు

- ఈనెల 16 నుంచి న్యూఢిల్లీలో పోటీలు


ఎస్.విజయలక్ష్మి


జి.ఆదిలక్ష్మి


ఎస్.కనకమహాలక్ష్మి

విజయనగరం: న్యూఢిల్లీలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల ఖోఖో పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయినులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరగబోయే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో మొదటిసారిగా ఖోఖో పోటీలు నిర్వహిస్తుండగా..రాష్ట్ర జట్టులోకి కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్.విజయలక్ష్మి, పెదతాడివాడ వ్యాయామ ఉపాధ్యాయిని జి.ఆదిలక్ష్మి, మెట్టపల్లి వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.కనకమహాలక్ష్మిలు ఎంపికవడం విశేషం. ఆలిండియా పోటీలకు వెళ్తున్న వ్యాయామ ఉపాధ్యాయినులను జిల్లా ఖోఖో, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

అండర్-19 కరాటే పోటీలకు 14 మంది ఎంపిక


కరాటే పోటీల్లో ఎంపికైన క్రీడాకారులతో సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ బాల, బాలికల కరాటే పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. ఈ మేరకు నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో గల ఇండోర్ స్టేడియంలో జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు హాజరుకాగా..వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు బాలికలు, ఏడుగురు బాలురును జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో పార్వతీపురం-మన్యం జిల్లాలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలను అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ, పలువురు కరాటే కోచ్‌లు పర్యవేక్షించారు.

15న జూడో క్రీడాకారుల ఎంపిక

అండర్-19 స్కూల్ గేమ్స్ జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు రామభద్రపురం మండలం కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 19 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండి 8, 9,10, ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

బంగారుతల్లికి ఘనంగా సన్మానం

- టెన్నికాయిట్ చాంపియన్ మౌనికకు ప్రశంసలు


టెన్నికాయిట్ చాంపియన్ మౌనికను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): సాధారణ రైతు కుటుంబానికి చెందిన ఆడబిడ్డ రెడ్డి మౌనిక ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచి బంగారుపతకాన్ని సాధించి భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిందని పలువురు ప్రజాప్రతినిధులు,వక్తలు ప్రశంసించారు. దక్షిణాఫ్రికాలో జరిగిన అండర్-23 ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రెడ్డి మౌనికను గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఆమె తల్లిదండ్రుల సమక్షంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ విద్యార్థినిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మౌనిక, మరిన్ని విజయ పతకాలు సాధించాలని ఆకాంక్షించి మెమొంటో, నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా మౌనికతో పాటు క్రీడల్లో రాణిస్తున్న అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు క్రీడాకారిణులు ప్రవల్లిక, రేణుక, శ్రావణిలను, కోచ్ రామారావును సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి విశ్వేశ్వరరావు, ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు, బమ్మిడి అప్పలస్వామి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, ఎడ్ల అప్పారావు, జీసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్, మండల విద్యాశాఖాధికారి పి.రామారావు, అన్ని పంచాయతీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు జిల్లా జట్టు


రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే సాఫ్ట్‌బాల్ జట్టు

బొబ్బిలి: నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డలో ఈనెల 16 నుంచి మూడు రోజుల పాటు జరిగే సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు శుక్రవారం పయనమైంది. ఈ జట్టుకు సుమారు పది రోజుల పాటు బొబ్బిలి మండలం పారాదిలో శిక్షణ ఇచ్చారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుంకరి సాయి రమేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎంవీనాయుడు తదితరులు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్ గెంజిపేటకు చెందిన కన్నేపల్లి మాధవి (39) మనస్తాపంతో ఉరివేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మాధవి, ఆమె భర్త ఓ ప్రైవేట్ కళాశాలలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి 18 ఏళ్ల కుమార్తె ఉంది. అయితే రెండు నెలల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. నాటి నుంచి ఆమె తీవ్రమనస్తాపంతో ఉంది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కొక్కానికి ఉరేసుకుని ప్రాణాలు తీసుకుంది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై ఎ.నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బాడంగి జట్టు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాడంగి జట్టుతో హెచ్‌ఎం, టీచర్లు

బాడంగి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరులో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు బాడంగి విద్యార్థులు ఎంపికైనట్లు హైస్కూల్ పీడీ జి.బంగారునాయుడు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ బొబ్బిలి మండలం పారాదిలో గురువారం జరిగిన జిల్లాస్థాయి జట్ల ఎంపికలో అండర్ 14, 17 బాలబాలికల విభాగంలో తమపాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు అత్యధికంగా విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. వారిలో టి.దిలీప్, ఎం.కార్తీక్, ఎం.శ్రీనివాస్, కె.రోహిత్, డి.గోవింద, ఎం.సందీప్, ఆర్.కిరణ్, ఎం.దేవకి, ఎం.ప్రసన్న, కె.జ్యోతి, కె.రమ్య, కె.తులసి, ఎస్.వరలక్ష్మి, ఎం.మౌనిక ఉన్నారని వివరించారు. పాఠశాల నుంచి అత్యధిక మంది విద్యార్థులు ఎంపికకావడంపట్ల పీడీ బంగారునాయుడిని, విద్యార్థుల్ని హెచ్‌ఎం డి.సత్యనారాయణ, ఇతర సిబ్బంది అభినందించారు.

నేడు విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ

- హాజరు కానున్న కేంద్రమంత్రి
- పూర్తయిన ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్


పంపిణీకి సిద్ధంగా ఉన్న బాటరీ ట్రైసైకిళ్లు

విజయనగరం అర్బన్: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలను కేంద్ర ప్రభుత్వ సంస్థ అలీమ్ కో సహాయంతో పెద్ద ఎత్తున పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు నగరంలోని రాజీవ్ స్టేడియంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో జిల్లాలోని 434 మంది విభిన్న ప్రతిభా వంతులకు వివిధ ఉపకరణాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వాటిలో రూ.42 వేల విలువైన బ్యాటరీతో నడిచే మోటరైజ్డ్ మూడు చక్రాల సైకిళ్లను కేంద్ర సామాజిక సాధికారిత సమాయ మంత్రి ఎ.నారాయణస్వామి శనివారం జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. దీంతోపాటు విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గుర్తించిన 310 మందికి ఉపకరణాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో నియోజకవర్గాల వారీగా నిర్వహించిన గుర్తింపు శిబిరాల ద్వారా ఎంపికైన వారందరికీ ఆయా నియోజకవర్గాల్లో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో రాజీవ్ స్టేడియంలో ఉపకరణాల పంపిణీ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విభిన్న ప్రతిభావంతులకు కూర్చునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వచ్చిన లబ్ధిదారులు, వారి సహాయకులకు భోజన వసతి సమకూర్చాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీతో కూడిన ట్రైసైకిళ్లను ఎలా వినియోగించాలో అవగాహన కల్పించాలని చెప్పారు. వాటిని ఆయా మండలాలకు పంపించేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని రవాణాశాఖ అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, డీఎస్ఓ మధుసూదనరావు, సెట్విజ్ సీఈఓ రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు శంకరరావు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మజ్జి శంకరరావు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు విజయనగరానికి చెందిన మజ్జి శంకరరావు అర్హత సాధించారు. ఇటీవల విశాఖలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో మూడు అంశాల్లో ఆయన 5 కిలోమీటర్ల వాకింగ్‌లో మూడవ స్థానం, 400 మీటర్ల పరుగు పోటీలు ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో తృతీయ స్థానం దక్కించుకున్నారు. విజయనగరానికి చెందిన కోచ్ ప్రభుకుమార్ వద్ద శిక్షణ పొందుతున్న ఆయన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని పలువురు సీనియర్ క్రీడాకారులు ఆకాంక్షించారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి


సంతోష్ (ఫైల్)

రామభద్రపురం: మండలకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందులూ శుక్రవారం మృతిచెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని వసంతల వీధికి చెందిన మడక సంతోష్(30) మద్యానికి బానిసయ్యాడు.ఈ క్రమంలో మద్యం తాగేందుకు కుటుంబసభ్యులను డబ్బులు అడగగా వారు లేవు అనడంతో మనస్తాపానికి గురై ఈ నెల 11వ తేదీన గడ్డి మందు తాగాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు సంతోష్‌కు బాడంగి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్టలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డైలాగ్‌కింగ్‌కు జ్ఞాన సరస్వతి విశిష్ట పురస్కారం

- 15 నుంచి 24 వరకూ శరన్నవరాత్రి మహోత్సవాలు
- 20న సామూహిక అక్షరాభ్యాసం


సాయికుమార్

విజయనగరం టౌన్: ప్రముఖ చలనచిత్ర నటుడు, డైలాగ్ కింగ్, డబ్బింగ్ ఆర్టిస్ట్, సుపరిచిత దూరదర్శన్ వ్యాఖ్యాత పూడిపెద్ది సాయికుమార్‌కు శ్రీ జ్ఞానసరస్వతి విశిష్ట పురస్కారం అందజేయనున్నట్లు శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ఆవరణలో వేదపండితులు, కమిటీ సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 29న ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఆలయం ఆవరణలో వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో అతిథుల సమక్షంలో సాయికుమార్‌ను ఘనంగా సత్కరించనున్నామని తెలిపారు. అదే విధంగా 19వ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆలయంలో నిర్వహిస్తున్నామన్నారు. 15నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 20న శుక్రవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తామని వివరించారు. భక్తులందరూ జ్ఞానసరస్వతి అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూతుర్ని ఇంటికి తీసుకువస్తుండగా..

- లారీ ఢీకొని తండ్రి మృతి
- గాయాల పాలైన చిన్నారి


రాము మృతదేహం

లక్కవరపుకోట: దసరా పండగ సెలవుల్లో చెల్లితో సరదాగా గడపుదామని ఎంతో ఆశగా తండ్రితో కలిసి ఇంటికి వెళ్తున్న క్రమంలో లారీ రూపంలో వచ్చిన మృత్యువు కన్నతండ్రిని కబళించగా కాలు విరిగి చిన్నారి తీవ్రగాయాలపాలైంది. లక్కవరపు కోట మండలంలోని అరకు-విశాఖ రోడ్డులో జమ్మాదేవిపేట గ్రామం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తవలస మండలం చీడివలస గ్రామానికి చెందిన సుధ రాము (33) మృతిచెందాడు.ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సుధ రాము కుమార్తె జోత్స్న స్థానిక జ్యోతిరావ్‌పూలే ఆదర్శపాఠశాలలో హాస్టల్‌లో ఉంటూ 5వ తరగతి చదువుతోంది. శనివారం నుంచి దసరా సెలవులు కావడంతో కుమార్తెను హాస్టల్ నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు రాము స్కూటీపై వచ్చి కుమార్తెను తీసుకు వెళ్తున్న సమయంలో జమ్మాదేవి పేట గ్రామం ఆంజనేయస్వామి టెంపుల్ సమీపంలో కొత్తవలస నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న క్వారీలారీ స్కూటీని బలంగా ఢీకొట్టింది. దీంతో తండ్రీ కూతుళ్లు తుళ్లిపడిపోయారు. ప్రమాదానికి గమనించిన స్థానికులు ప్రథమ చికిత్స నిర్వహించి ఎస్.కోట సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో రాము మృతి చెందాడు. చిన్నారి జోత్స్నకు కుడికాలు రెండు చోట్ల విరిగిపోయింది. మృతుడు రాము రైస్ మిల్లిలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎల్.కోట పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా లారీ డ్రైవర్ లారీని అక్కడ వదిలేసి పరారయాడు.

ఫలితమిస్తున్న అవగాహన



హెచ్‌ఐవీ రోగులకు మందులు అందజేసే ఏఆర్‌టీ సెంటర్

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ-ఎయిడ్స్ ఎవరికైనా సోకిందని తెలిస్తే ఆ వ్యాధి సోకిన వ్యక్తి ఇంటికి గాని, ఆ ఛాయలకు గాని జనం వెళ్లే వారు. అంతేకాకుండా కనీసం ఆవ్యక్తితో మాట్లాడడానికి, పక్కన కూర్చోవడానికి ఇష్టపడేవారు కాదు. ఒకప్పుడు ఆ వ్యాధి వ్యాప్తి తీవ్రస్థాయిలో ఉండేది. హెచ్‌ఐవీపై అవగాహన లేక చాలా మంది దాని బారిన పడేవారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయడం, అవగాహన కల్పించడం కారణంగా వ్యాధి వ్యాప్తి క్రమేణా తగ్గుతోంది. గతంలో హెచ్‌ఐవీ పరీక్ష చేసుకోవడానికి ముందుకు వచ్చేవారు కాదు. ఇప్పుడు స్వచ్ఛందంగా చాలామంది ముందుకు వస్తున్నారు.

జిల్లాలో చికిత్స సౌకర్యాలు ఇవి

విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఏఆర్‌టీ కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 8 లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు, 83 ఐసీటీసీ కేంద్రాలు, 10 రక్త నిధి కేంద్రాలు ఉన్నాయి. హెచ్‌ఐవీ బాధితుల సంక్షేమం కోసం 6 స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి.

'జిల్లాలో నమోదైన కేసులిలా..

సంవత్సరం	పరీక్షలు	పాజిటివ్ కేసులు
2020-21	41,943	329
2021-22	73,916	403
2022-23	90,231	495
2023-24	43,781238	(సెప్టెంబర్ వరకు)

జిల్లాలో హెచ్‌ఐవీ కేసుల వివరాలు:

జిల్లాలో హెచ్‌ఐవీ రోగులు 15,009 మంది నమోదయ్యారు. వారిలో పురుషులు, 7,338, మహిళలు 7,097, పిల్లలు 574 మంది ఉన్నారు. ఏఆర్‌టీ కేంద్రంలో 13,330 మంది రిజిస్టర్ అయ్యారు. ఏఆర్‌టీ కేంద్రంలో ప్రస్తుతం మందులు వాడుతున్న వారు 7,816 మంది ఉన్నారు.

పెరిగిన అవగాహన

హెచ్‌ఐవీపై విస్తృతంగా అవగాహన కల్పిస్తుండడంతో వ్యాప్తి తగ్గుతోంది. ప్రజల్లో కూడా గతంలో కంటే అవగాహన బాగా పెరిగింది. – డాక్టర్ సూర్యనారాయణ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250